

రాష్ట్రంలో మహిళలకు కరువైన రక్షణ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలకు రక్షణ కరువైందని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. - 8లో..



కార్పొరేట్లకు కూటమి దాసోహం

కూటమి ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాలకు అనుకూలంగా పనిచేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
39 /30

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.



అప్పులు పెరిగి బతుకు భారమై..



యలమందయ్య మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు (ఫైల్)



యలమందయ్య (ఫైల్)

మార్కాపురానికి చెందిన రాజారపు పెద్ద యలమందయ్య అనే రైతు 7 ఎకరాల పొలం కౌలుకు తీసుకున్నాడు. ఏటా మిర్చి, పత్తి తదితర పంటలు సాగు చేస్తున్నాడు. ముగ్గురు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేశాడు. రైతు భరోసా అందకపోవడంతో పంటల సాగు కోసం వడ్డీలకు అప్పులు తీసుకున్నాడు. కుటుంబాన్ని పోషించుకుంటూ మరో వైపు పండించిన పంటలకు ఆశించిన ధర లేకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. తెచ్చిన అప్పులు పెరిగి రూ.25 లక్షల వరకు అయ్యాయి. నెల క్రితం అప్పు ఇచ్చిన వ్యక్తి ఇంటి వద్దకు వచ్చి గొడవ చేశాడు. ఈ ఏడాది పంట దిగుబడులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయాడు. దీంతో దిక్కు తోచని స్థితిలో ఈనెల 7వ తేదీ ఉదయం పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

ధరలు పడిపోవడంతో బలవన్మరణం



ఈ వ్యక్తి పేరు కలువా బాలకోటిరెడ్డి. తాళ్లూరు మండలంలోని చింతలపాలేనికి చెందిన ఆయనకు ఇద్దరు కుమార్తెలు కాగా వారిని వివాహాలయ్యాయి. గత రబీ సీజన్లో రెండు ఎకరాల్లో మిర్చి, ఎకరంలో టమోట, ఎకరంలో వరి నాటాడు. మిర్చి, టమోట పంట కోసం భారీగా అప్పులు చేశాడు. అకాల వర్షంతో టమోట పంట పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. మిరప ధరలపై ఈఏడాది ఫిబ్రవరి 3న తోటి రైతులను గ్రామంలో ఆరా తీసిన బాలకోటిరెడ్డి ధరలు పడిపోయాయని తెలుసుకుని తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. అప్పులు ఎలా తీర్చాలని మథనపడ్డాడు. వెంటనే పొలానికి వెళ్లి మిరపకు కొట్టేందుకు తెచ్చుకున్న పురుగుమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మూడు రోజుల అనంతరం మృతి చెందాడు.

అప్పులు తీర్చలేమన్న బెంగతో..



ఈ రైతుపేరు రాచకొండ శ్రీను. తర్లుపాడు మండలంలోని పోతలపాడు స్వగ్రామం. గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లో 5 ఎకరాల్లో కంది, మిర్చి, పొగాకు పంటలు సాగుచేశాడు. దిగుబడులు ఆశించినమేర రాకపోవడం, పెట్టుబడి వ్యయం ఎక్కువకావడంతో అప్పులు తీర్చలేనన్న బాధతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లోనే పురుగుల మందు తాగి మార్చి 21న ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రైతు రాచకొండ శ్రీనుకు భార్య వెంకటరత్నమ్మ, కుమారుడు ఉన్నారు. అప్పుల బాధతో భర్త అకాల మరణం చెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది.

పొగాకు..మిర్చి..శనగ..ధాన్యం..కంది..పత్తి..పసుపు.. జిల్లాలో ఏ రైతును కదిలించినా కన్నీటి వ్యథలే.. కనీస గిట్టుబాటు ధరలు రాక అన్నదాతల పరిస్థితి చావో...రేవో అన్నట్లుగా తయారైంది. కాయకష్టం చేసి ఆరుగాలం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రాక రైతులు విలవిల్లాడుతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలో ఏ ఒక్క పంటకూ గిట్టుబాటు ధర రాలేదంటే అన్నదాత దీనావస్థ ఏ విధంగా ఉందో అర్థమవుతోంది. మిర్చి రైతు లబోదిబోమన్నాడు. వరి, శనగ, పత్తి, మినుము ఇలా ఏ పంట చూసుకున్నా గిట్టుబాటు ధర రాక అందినకాడికి తెగనమ్ముకుంటున్నారు. ఇలాంటి పరిస్థితులు గతంలో ఎన్నడూ రాలేదని రైతన్నలు వాపోతున్నారు.

- ఏడాదిలో ఏడుగురు రైతుల ఆత్మహత్య
- గిట్టుబాటు ధరలు రాక తనువు చాలిస్తున్న రైతన్నలు
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు మొదలైన కష్టాలు
- చెమటోడ్చి పండించిన పంటలకు పెట్టుబడి రాక అన్నదాత విలవిల
- పొగాకు రైతు పరిస్థితి దయనీయం
- పొగాకు రైతుకు అండగా నిలిచేందుకు నేడు పొదిలికి వస్తున్న వైఎస్ జగన్

పొగాకు ధరలు పతనమై..ఆశలు ఆవిరై..



కొండపి మండలం నెన్నూరుపాడుకు చెందిన చల్ల మధుసూదన్‌రెడ్డి తన తండ్రితో కలిసి 10 ఎకరాల్లో పొగాకు సాగు చేశాడు. మరో 5 ఎకరాలు కౌలుకు తీసుకుని పొగాకు పండించారు. గత ఏడాది పొగాకుకు మంచి ధర లభించడంతో ఈ ఏడాది రూ.20 లక్షల వరకు అప్పులు చేసి పొగాకు సాగు చేశాడు. వేలం ప్రారంభమైన దగ్గర నుంచి గిట్టుబాటు ధర లేదని చాలా సార్లు బాధపడ్డాడు. నాణ్యమైన పొగాకుకు కూడా చాలా తక్కువ ధర కేటాయిస్తున్నారని కూలీల ఖర్చులకి కూడా వచ్చే అవకాశం లేదని తీవ్ర మనోవేదన చెందాడు. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో గిట్టుబాటు ధర లేక ఈనెల 6వ తేదీన కొండపిలోని పొగాకు బోర్డు వెనక ఉన్న పాకలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని కుమారుడు వంశీకృష్ణారెడ్డి బీటెక్ చదివి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. మరో కుమారుడు ఇంటర్మీడియెట్ చదివి నీట్ పరీక్షలు రాశాడు. పొలం అమ్మినా అప్పులు తీరేలా లేవని తమ్ముడి చదువు ఎలాగన్న ఆందోళన నెలకొందని కుమారుడు వంశీకృష్ణారెడ్డి వాపోయారు. ప్రభుత్వం స్పందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నాడు.

కాడి బరువై.. పాడె చేరువై!

సాక్షి ఫోకస్

దిగుబడులు రాక..అప్పులు తీరక



పెద్దారవీడు పంచాయతీలో సిద్ధిరాయునిపల్లి గ్రామానికి చెందిన రుద్రపాటి చిన్న వెంకట చెన్నయ్య (70) గత ఏడాది రెండు ఎకరాల్లో మిర్చి, ఎకరన్నరలో టమోటా, రెండున్నర ఎకరాల్లో పొగాకు పంటలు సాగుచేశాడు. పొలంలో మూడు బోర్లు వేశాడు. బోరు నుంచి నీరు అరకొరగా రావడంతో సాగునీటికి అవస్థలు పడ్డాడు. సాగుచేసిన పంటకు చీడపీడలు, తెగుళ్లు రావడం.. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పాటు పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో అప్పులపాలయ్యాడు. దాదాపు రూ.9 లక్షలు అప్పు ఉంది. అందులో పెద్దారవీడు ఎస్‌బీఐలో రూ.1.30 లక్షలు, దేవరాజుగట్టు కెనరా బ్యాంకులో రూ.1 లక్ష, మిగిలినవి ఇతరుల దగ్గర అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం తెలియక 2024 అక్టోబర్ 8వ తేదీన ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

జిల్లాలో 2024–25 రబీ సీజన్‌లో సాధారణంగా 3,97,880 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయాల్సి ఉంది. అయితే కేవలం 2,99,331 ఎకరాల్లో మాత్రమే పంటలు సాగయ్యాయి. వేసిన పంటల్లో కూడా దాదాపు లక్షకు పైగా ఎకరాల్లో నిలువునా ఎండిపోయాయి. మిగతా 1.99 లక్షల ఎకరాల్లో కూడా సగానికిపైగా ఎకరాల్లో దిగుబడి మరీ దారుణంగా పడిపోయింది. దాదాపు జిల్లాలో 4 లక్షల ఎకరాల్లో పంటలు సాగుచేయాల్సి ఉండగా, చివరకు దిగుబడి అంతంతమాత్రంగా వచ్చింది. కేవలం లక్ష ఎకరాల్లోపే అన్నది స్పష్టమవుతోంది.

పొగాకు రైతును ముంచేసిన పాలకులు..

జిల్లాలో పొగాకు రైతు పరిస్థితి ముందుగొయ్యి..వెనుక నుయ్యి అన్న చందంగా తయారైంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఊహించని లాభాలు గడించిన రైతులు నేడు కనీస పెట్టుబడి రాక అప్పుల పాలవుతున్నారు. రీజియన్ పరిధిలోని 11 వేలం కేంద్రాల పరిధిలో 30 వేల మందికి పైగా రైతులు పొగాకు సాగుచేస్తున్నారు. 39 వేల బ్యారన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 105.2 మిలియన్ల కిలోల పొగాకు ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇచ్చింది. అయితే 159.45 మిలియన్ కిలోల వరకూ ఉత్పత్తి వస్తుందని అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు, కొనుగోలు సంస్థల ప్రతినిధులు అంచనా వేస్తున్నారు. వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్లు ప్రారంభమై సరిగ్గా 90 రోజులు కావస్తున్నా మద్దతు రాకపోవడంతో చివరకు ఎదురు చూపులే మిగిలాయి. నాణ్యమైన పొగాకుకు కూడా కిలోకు సరాసరి రూ.240కి మించడం లేదు. నాణ్యత పేరుతో ధరలను భారీగా తగ్గించేస్తున్నారు. చాలా కేంద్రాల్లో కిలో రూ.160 నమోదవుతుండడం గమనార్హం. మొత్తం 32 కంపెనీలు పొగాకు కొనుగోళ్లకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయి. కానీ కేవలం 15 నుంచి 18 కంపెనీలు మాత్రమే వేలంలో పాల్గొంటున్నాయి. దీంతో కంపెనీలు రైతు బతుకులతో ఎలా ఆడుకుంటున్నాయో అర్థమవుతోంది. గత ఏడాదితో పోల్చుకుంటే పొగాకు సాగు ఖర్చులు 20 నుంచి 25 శాతం వరకూ పెరిగాయి. అన్నీ కలిపి ఎకరాకు సుమారు రూ.2 లక్షల పెట్టుబడి పెట్టారు. తీరా ధరలు నేల చూపులు చూస్తుండడంతో రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారు. ఒకవైపు వ్యాపారుల మాయాజాలం, మరోవైపు పొగాకు బోర్డు, టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో రైతులు ఆందోళన బాట పడుతున్నారు. రోజుకో ప్రాంతంలో ధర్నాలు చేస్తూ పోతున్నారు. అయినా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకోవడం లేదు. బోర్డు అధికారులు సైతం తూతూ మంత్రంగా వ్యవహరిస్తుండటంతో రైతులు అప్పుల పాలవుతున్నారు.

మిర్చి రైతు కంట్లో కారం..

జిల్లాలోని పశ్చిమ ప్రకాశంలో మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి, దర్శి తదితర నియోజకవర్గాల్లోని గ్రామాల్లో రైతులు అత్యధికంగా మిర్చి సాగు చేస్తారు. వైఎస్సార్ సీపీ హయాంలో 96 వేల ఎకరాల్లో సాగు చేసిన రైతులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగు విస్తీర్ణాన్ని భారీగా తగ్గించేశారు. ఈ సారి సుమారు 59,005 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. గత ఏడాది నవంబర్‌లో క్వింటా ధర రూ.17 వేల నుంచి రూ.18 వేలు ఉండగా, డిసెంబరు నాటికి రూ.14 వేలకు పడిపోయింది. జనవరిలో రూ.14 వేల నుంచి రూ.12 వేలకు చేరి మార్చిలో రూ.10 వేలు కనిష్టానికి పడిపోయింది. ఇక మిర్చి కోతలకు కూలీలకు భారీగా చెల్లించాల్సి వస్తోంది. క్వింటా మిర్చి కోసేందుకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకూ ఖర్చు చెల్లిస్తున్నామని రైతులు తెలిపారు. దీంతో మిర్చి రైతు ఆర్థికంగా చితికిపోయాడు.

'కంది'పోయిన ధరలు..

జిల్లాలో మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గాల పరిధిలోని మెట్ట భూముల్లో రైతులు ఏటా కంది పైరు సాగు చేస్తూ వస్తున్నారు. 66,500 ఎకరాలకు పైగా కంది సాగు చేశారు. మార్కెట్‌లో కందులకు డిమాండ్ ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం అదేమీ పట్టించుకోలేదు. క్వింటా కందులకు ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.7,550 ప్రకటించింది. దీంతో కందుల ధర ఒక్కసారిగా పడిపోయింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర తక్కువగా ఉండటంతో పెట్టిన పెట్టుబడి కూడా చేతికొచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళనలకు గురయ్యారు.

ధాన్యం రైతు దైన్యం..

జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో మొత్తం 40 వేల హెక్టార్లలో వరి సాగుచేయాల్సి ఉంది. అయితే వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో 23 వేల హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టారు. సుమారు 90 వేల నుంచి లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చినట్టు అధికారుల అంచనా. స్థానిక అవసరాలకు కలుపుకుని సగానికి అవసరం అనుకున్నా 40 వేల మెట్రిక్ టన్నులు పోను మిగతా 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి రైతుల నుంచి కొనుగోలు చేయాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్‌లో కేవలం 5 వేల మెట్రిక్ టన్నులు లక్ష్యంగా నిర్ణయించి కొనుగోలు చేసింది. ధరలు తగ్గించి దళారులు దోచేయడంతో ధాన్యం రైతు అప్పులు పాలయ్యాడు. మధ్యలో ధరలు కొంచెం పెరిగినా అప్పటికే రైతుకు జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

పసుపు రైతూ దిగాలు..

రాష్ట్రంలో పసుపు పంట ఎక్కువగా సాగయ్యే జిల్లాల్లో ప్రకాశం ఒకటి. జిల్లాలోని కంభం, గిద్దలూరు, బేస్తవారిపేట, కొమరోలు, రాచర్ల, అర్ధవీడు, సీఎస్‌పురం, దర్శి మండలాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో పసుపు సాగు చేస్తున్నారు. పంట చేతికొస్తే అప్పులు తీరుతాయని గంపెడాశలు పెట్టుకున్నారు. పెట్టుబడి లక్షన్నర వరకూ అయింది. దిగుబడి తగ్గడం, మార్కెట్లో రేటు అమాంతం పడిపోవడంతో పసుపు రైతు కష్టాల్లో పడ్డాడు.

పంటలు ఎండి..ప్రాణాలు వదిలి



అర్ధవీడు మండలం కాకర్లకు చెందిన చిన్న దిబ్బారెడ్డి (42) నాలుగేళ్లుగా తనకున్న 8 ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేశాడు. ఏ పంటలోనూ సరైన దిగుబడి రాలేదు. దీంతో దాదాపు రూ.15 లక్షల మేర అప్పులయ్యాయి. గత ఏడాది బోర్ల కింద 2 ఎకరాల్లో పొగాకు నారుమండి, 5 ఎకరాల్లో మిర్చి సాగుచేశాడు. తీవ్ర వర్షాభావంతో పంటలు పూర్తిగా ఎండిపోయి కుంగిపోయాడు. 2024 అక్టోబర్ 28వ తేదీ సాయంత్రం పొలానికి వెళ్లి పురుగులమందు తాగాడు. ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో వెతుక్కుంటూ పొలానికి వెళ్లిన కుటుంబ సభ్యులకు అపస్మారక స్థితిలో ఉన్న దిబ్బారెడ్డిని చూసి అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

రైతు ఆత్మహత్యతో ఊరొదిలిన కుటుంబం



అర్ధవీడు మండలంలోని చిములేటిపల్లెకు చెందిన రైతు నడిపి వెంకటేశ్వర్లు (43) తనకున్న రెండు ఎకరాల పొలంతో పాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని గత ఏడాది పత్తి, మొక్కజొన్న, మిరప పంటలు సాగుచేశాడు. 20 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్న వెంకటేశ్వర్లు పంటల సాగు కోసం బ్యాంకు రుణం రూ.లక్ష, బయట అధిక వడ్డీలకు రూ.7లక్షల వరకు అప్పు చేశాడు. పంటలు సరిగా పండకపోవడంతో పాటు అప్పులు తీర్చే మార్గం తెలియక 2024 అక్టోబర్ 31న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయాడు. భర్త మరణంతో భార్య లక్ష్మీ, ఇద్దరు కుమారులను తీసుకుని ఊరు వదిలి తన పుట్టింటికి వెళ్లింది.

నేడు పొదిలికి వైఎస్ జగన్



- జగనన్న రాక కోసం సర్వం సిద్ధం
- సమస్యలపై బోర్డులో పొగాకు రైతులతో ముఖాముఖి
- భారీ ఏర్పాట్లు చేసిన పార్టీ శ్రేణులు



రోడ్డుకు ఇరువైపులా భారీగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి

సాక్షి ప్రతినిధి ఒంగోలు: పొగాకు రైతుల **కష్టాలను** నేరుగా తెలుసుకునేందుకు, **వారికి** అండగా నిలిచేందుకు వైఎస్సార్ సీపీ **అధినేత**, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ **మోహన్**రెడ్డి బుధవారం పొదిలి పట్టణానికి **రానున్నారు**. ఉదయం తాడేపల్లి నుంచి **బయలు**దేరి 11 గంటలకు పట్టణ శివారులో **ఏర్పాటు** చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుం**టారు.** అక్కడ నుంచి పొగాకు బోర్డుకు చేరు**కుంటారు**. గం.11.25 నుంచి గం.12.25 **వరకు** పొగాకు బోర్డు వేలం కేంద్రాన్ని సం**దర్శించి** రైతులతో ముఖాముఖి మాట్లాడ**తారు.** గం.12.25 కు పొగాకు బోర్డు నుంచి **హెలిప్యాడ్**కు చేరుకుంటారు. గం.12.45కు **హెలికాఫ్టర్** ద్వారా తాడేపల్లి వెళ్తారు.

హెలిప్యాడ్ వద్ద సర్వం సిద్ధం:

పొదిలి రూరల్: వైఎస్ జగన్ పర్యటన కోసం **పొదిలి**–దర్శి రోడ్డులోని ఎస్ఎస్ఆర్ పెట్రోల్ **బంక్** వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ **పనులు** పూర్తయ్యాయి. పొదిలి–దర్శి తారు రోడ్డు నుంచి హెలిప్యాడ్ స్థలం వరకు రోడ్డు చదును చేయడంతో పాటు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

భారీగా వెలసిన ఫ్లెక్సీలు

హెలిప్యాడ్ నుంచి నిర్మమహేశ్వరస్వామి దేవస్థానం, పెద్ద బస్టాండ్, పోలీసు స్టేషన్ మీదుగా వైఎస్ జగన్ పొగాకు బోర్డుకు చేరుకుంటారు. దీంతో హెలిప్యాడ్ నుంచి పొగాకు బోర్డుకు దాదాపు రెండు కిలోమీటర్లపైగా పార్టీ శ్రేణులు రోడ్డుకు ఇరువైపులా భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

ఏర్పాట్లు ఇలా..

పొగాకు రైతుల పోరుబాట కార్యక్రమానికి వస్తున్న రైతులకు వేసవి దృష్ట్యా ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండటానికి భోజనాలు, మంచినీరు, మజ్జిగ సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి భారీగా రైతులు తరలి వచ్చే అవకాశం ఉండటంతో ఎక్కడికక్కడే భోజన స్టాల్స్ ఏర్పాటు చేశారు. దర్శి వైపు నుంచి వచ్చేవారి కోసం మంజునాథ కళ్యాణ మండపం వద్ద, కొండపి, ఒంగోలు వైపు నుంచి వచ్చే వారికి ఒంగోలు రోడ్డులోని డాన్ రెస్టారెంట్ వద్ద, పొగాకు బోర్డుకు వచ్చే వారి కోసం పోలీసు స్టేషన్ పక్కన, కనిగిరి, గిద్దలూరు, మార్కాపురం, వైపాలెం నుంచి వచ్చే రైతులకు విశ్వనాథపురంలోని చర్చి సెంటరు, పాత వెంకటేశ్వర సినిమా థియేటర్ దగ్గర భోజన సదుపాయాలు కల్పించారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన బూచేపల్లి:

వైఎస్ జగన్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మార్కాపురం, గిద్దలూరు పార్టీ ఇన్‌చార్జ్‌లు, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి పరిశీలించారు. హెలిప్యాడ్, పొగాకు బోర్డు, భోజన వసతులు పరిశీలించారు. ఈ సందర్భంగా బూచేపల్లి మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది పొగాకు రైతులు అన్నిరకాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉన్నప్పుడు క్వింటా పొగాకు రూ.34 వేలు పలికితే, ఈ ప్రభుత్వంలో కేవలం రూ.24 వేలు మాత్రమే పలుకుతోందన్నారు. వచ్చిన పొగాకులో 50 శాతం వెనక్కి తీసుకుపోవాల్సి రావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ సమస్యను జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. రైతులను ఆదుకోవడం కోసం వైఎస్సార్ సీపీ వారికి అండగా ఉంటుందని, రైతులు అధైర్య పడవద్దన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో 125 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోగా, వారం రోజుల్లోనే జిల్లాలో ముగ్గురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. బూచేపల్లి వెంట వైఎస్సార్ సీపీ నాయకులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, జీ శ్రీనివాసులు, వై వెంకటేశ్వరరావు, గుజ్జుల సంజీవరెడ్డి, రమణారెడ్డి, కే నరసింహారావు, ఫిరోజ్, మాబాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు అవిశ్వాస తీర్మానం

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపల్ చైర్మన్‌పై టీడీపీ నాయకులు కలెక్టర్‌కు ఇచ్చిన అవిశ్వాస తీర్మానంలో భాగంగా బుధవారం సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ డీవీఎస్ నారాయణరావు మంగళవారం తెలిపారు. సమావేశానికి సభ్యులు హాజరుకావాలన్నారు.

క్లుప్తంగా

జగనన్న పోరుబాటకు తరలిరండి

● ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన రైతన్నకు అండగా పొదిలిలో బుధవారం జరిగే 'జగనన్న పోరుబాట' కార్యక్రమానికి రైతులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఉదయం 6.30 గంటలకు వైపాలెంలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి పెద్దారవీడు మండలంలోని దేవరాజుగట్టు వద్దకు చేరుతామని, అక్కడ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీగా పొదిలికి చేరుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రతి గ్రామం నుంచి రైతులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జగనన్న పోరుబాటను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

చెరువులో పడి యువకుడు మృతి



మృతుడు నాగ వెంకటేష్

సంతనూతలపాడు: ప్రమాదావశత్తు చెరువులో పడి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన సంతనూతలపాడులో జరిగింది. ఏఎస్సై వెంకట్రావు కథనం మేరకు.. చీమకుర్తికి కోటకట్లవారి వీధిలో నివాసముండే నేరెళ్ల చిన్న నాగ వెంకటేష్(24) చెరువు వద్ద వ్యక్తిగత పని నిమిత్తం దిగేందుకు ప్రయత్నించగా ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాటమరాజు దేవస్థానం రోడ్డుకు సహకరించాలి

● డీఎఫ్ఓకు ఆలయ కమిటీ విన్నపం



డీఎఫ్ఓతో మాట్లాడుతున్న గంగరాజు, పీఎల్పీయాదవ్ తదితరులు

మార్కాపురం: వేనూతల కాటమరాజు ఆలయ పరిధి ఏ మేరకు ఉంటుందో సర్వే చేపట్టి, దేవస్థానానికి నూతన రోడ్డు మంజూరుకు కృషి చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మా గంగరాజు యాదవ్, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు పీఎల్పీ యాదవ్ మంగళవారం మార్కాపురం డీఎఫ్ఓకు విజ్ఞప్తి చేశారు. వెలిగొండ ప్రాజెక్టుకు నీళ్లు విడుదల చేస్తే ఆలయానికి వెళ్లే రహదారి మూసుకుపోతుందని, ఈ నేపథ్యంలో నూతన రోడ్డు మంజూరుకు కృషి చేయాలని కోరారు.

తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



పెద్దారవీడు: మండలంలోని రాజంపల్లి సమీపంలో రాజ్యలక్ష్మి సమేత గొబ్బాలికొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాలకు మంగళవారం సాయంత్రం అంకురార్పణ చేశారు. అర్చకులు కాశావజ్జల భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున 5 నుంచి 8 గంటల వరకు రాజ్యలక్ష్మి సమేత తిరుమలనాథ స్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఈఓ చెన్నకేశవరెడ్డి తెలిపారు.

డ్రంక్అండ్‌డ్రైవ్‌లో 23 మందికి జరిమానా

ఒంగోలు టౌన్: మద్యం తాగి వాహనాలను నడిపే వారికి జిల్లా పోలీసులు గట్టి షాక్ ఇచ్చారు. ఒంగోలు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 23 మంది పట్టుబడ్డారు. బ్రీతింగ్ పరీక్షలు చేసి కేసులు నమోదు చేశారు. వీరిని కోర్టు ముందు హాజరుపరచగా జడ్జి ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలను నడిపి ప్రమాదాలకు గురైతే ప్రాణాలు కోల్పోవడమో, తీవ్రంగా గాయపడడమో సంభవిస్తుందని తెలిపారు. మైనర్ డ్రైవింగ్, అతి వేగం, ట్రిపుల్ డ్రైవింగ్, సెల్‌ఫోన్లో మాట్లాడుతూ వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలను నివారించడానికి బ్లాక్ స్పాట్స్, యాక్సిడెంట్ ప్రోన్ ఏరియాల వద్ద సైన్ బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు



ఒంగోలులో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా విభాగం నేతలు

- పసిమొగ్గలపై సైతం అఘాయిత్యాలు
- కూటమి పాలనలో రెచ్చిపోతున్న మృగాళ్లు
- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు సిటీ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళలకు రక్షణ కరువైందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ధ్వజమెత్తారు. మహిళలపై జరుగుతున్న హత్యలు, అఘాయిత్యాలు, లైంగిక దాడులను అరికట్టడంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఒంగోలు నగరంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశయాప్ తీసుకువచ్చి మహిళలకు అండగా నిలిచారన్నారు. అర్ధరాత్రి సైతం మహిళకు ఎలాంటి కష్టం వచ్చినా క్షణాల్లో పోలీసులు వచ్చి రక్షణ కల్పించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పసిమొగ్గలపై సైతం అఘాయిత్యాలు పెరిగిపోయాయని, వారికి రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ చర్యలు శూన్యం కావడంతో మృగాళ్లు రెచ్చిపోతున్నారని ధ్వజమెత్తారు. పాఠశాలల్లో చదువులు చెప్పాల్సిన గురువులే కీచకులుగా మారడం శోచనీయమన్నారు. అధికార పార్టీ నేతల అండదండలతో వారు స్వేచ్ఛగా తిరుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తుంగలోకి తొక్కిందని ఆమె ధ్వజమెత్తారు. ఏడాదిలో ఒక్కసారి కూడా అమ్మఒడి ఇవ్వకపోవడంతో విద్యార్థులు చదువుకునేందుకు అవస్థలు పడుతున్నారని వాపోయారు. సామాన్య, మధ్య తరగతి విద్యార్థులు సైతం ఉన్నత చదువులు చదువుకునేందుకు జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో చర్యలు తీసుకుంటే..నేటి కూటమి ప్రభుత్వం వాటిని అటకెక్కించిందన్నారు. రాష్ట్రంలో సంక్షేమాన్ని విస్మరించి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని మండిపడ్డారు. తెనాలిలో యువకులపై పోలీసులు విచక్షణారహితంగా దాడులు చేయడం చూస్తుంటే ప్రజలకు రక్షణ ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో రైతులను ప్రభుత్వం విస్మరించిందని, దీంతో గిట్టుబాటు ధరలు అందక రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఆర్థికంగా చితికిపోతున్న పొగాకు రైతులకు అండగా నిలిచేందుకు జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం పొదిలి వస్తున్నారన్నారు.

కార్యక్రమంలో ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, ఒంగోలు నగరఅధ్యక్షులు కఠారి శంకరరావు, సంతనూతలపాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, మాధవి, పేరం ప్రసన్న, బత్తుల ప్రమీల, మేరీకుమారి, లక్ష్మీకాంతం, అప్సర్, రాజేశ్వరి, వాణి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై పెచ్చుమీరిన దాడులు

మహిళలపై రోజు రోజుకూ దాడులు పెరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ మండిపడ్డారు. ఏడాది కాలంలో రాష్ట్రంలో ప్రతి రోజూ మహిళలపై, చిన్నారులపై అరాచకాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. మహిళా హోం మంత్రి ఉండి కూడా ఆమె స్పందించకపోవడం దారుణమన్నారు. మా ప్రభుత్వ హయాంలో మహిళలకు జగన్ మోహన్‌రెడ్డి ధైర్యం ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేని కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతూ ప్రశ్నిస్తున్న వారిపై కేసులు పెడుతోందని ధ్వజమెత్తారు. సాక్షి మీడియాపై దాడి చేయడం, కార్యాలయాల మీద దాడిచేయడం వంటి సంఘటనలన్నీ ప్రజలను తప్పుదోవ పట్టించడానికేనన్నారు. రాష్ట్రంలో బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని, రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. అందుకే మహిళలకు రక్షణ కరువైందన్నారు. హనుమంతునిపాడు ఎంపీపీ గాయం సావిత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ, ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. మహిళలపై నిత్యం ఏదో ఒక ప్రాంతంలో అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నా కనీస చర్యలు లేవన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఇతర మహిళా నాయకురాళ్లు

ఉపాధ్యాయ సంఘాల మధ్య వాగ్వాదం

● ప్రారంభం కాకుండానే నిలిచిన ఎస్జీటీ కౌన్సెలింగ్

ఒంగోలు సిటీ: ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ రసాభాసగా మారుతోంది. ప్రభుత్వ అలసత్వం కారణంగా ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా ఎస్జీటీ మాన్యువల్ కౌన్సెలింగ్ సందర్భంగా జిల్లా కేంద్రంలో రెండు ఉపాధ్యాయ సంఘాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ప్రారంభం కాకుండానే కౌన్సెలింగ్ వాయిదా పడింది. ఏపీటీఎఫ్ ఉపాధ్యాయురాలు ఒక ప్రిఫరెన్షియల్ కేటగిరి కింద గతంలో పొంది ఉంది. అయితే మరో ఉపాధ్యాయ సంఘం వాళ్లు డీఈఓ దృష్టికి వెళ్లి తీసివేశారు. దీంతో రెసిడెన్షియల్ కేటగిరి కోల్పోయిన యూటీఎఫ్ సంఘ ఉపాధ్యాయురాలు విషయాన్ని సంఘం దృష్టికి తీసుకెళ్లింది. దీంతో ఇరు సంఘాల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. దీంతో అధికారులు కౌన్సెలింగ్ బుధవారానికి వాయిదా వేశారు.

మున్సిపల్ కమిషనర్‌గా రమణబాబు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మున్సిపల్ కమిషనర్‌గా ఈవీ రమణబాబును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నందిగామలో కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న రమణబాబును గిద్దలూరుకు.. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఐ.శ్రీనివాసులును పిడుగురాళ్లకు బదిలీ చేసింది.

కార్పొరేట్లకు కూటమి దాసోహం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్:

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాలకు అనుకూలంగా పని చేస్తోందని, కార్పొరేట్లను అదుపులో ఉంచలేని సమర్థ ప్రభుత్వం పీ 4 గురించి మాట్లాడడం హాస్యాస్పదం ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 10 శాతం ఉన్న కార్పొరేట్ కంపెనీలో 20 శాతం ప్రజల అభివృద్ధికి పాటుపడతాయని చెప్పడం పెద్ద జోక్ అని అభివర్ణించారు. ఉగాది నాడు మేఘ కంపెనీ బంగారు కుటుంబం పేరుతో నాలుగు కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు ప్రకటించిందని, ఆ కంపెనీకి దాతృత్వం ఉంటే పోలవరం ప్రాజెక్టులో పని చేస్తున్న కార్మికులకు కనీసం వెయ్యి రుపాయల వేతనం పెంచి ఉండేదన్నారు. గత ఏడాది లాభాలు పొందిన ఐటీసీసీ, జీపీఐ కంపెనీలు పొగాకు కొనుగోలు చేయవచ్చు కదా అని ప్రశ్నించారు. గత ఏడాది మంచి లాభాలు పొందిన ఈ కంపెనీలు రైతుల శ్రమను ఊడ్చేయాలని ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. ఈ ఏడాది మొదటి 3 నెలల్లో పొగాకు రైతుల ఆదాయం 40 శాతం పడిపోతే ఐటీసీ షేర్ విలువ 4 శాతం పెరగడం వెనుక ప్రోత్సాహం ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. కార్పొరేట్ల ఆదాయాన్ని ఆధారంగా చేసుకొని జీడీపీని లెక్కించడం సరైన పద్ధతి కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసి యోగాంధ్ర పేరుతో మోడీ మెప్పు పొందే పనిలో పడిందని వ్యాఖ్యానించారు. శ్రమజీవులకు యోగాతో అవసరం లేదని, శ్రమకు తగిన ఫలితం పొందినప్పుడే మానసిక ప్రశాంతత పొందుతారని చెప్పారు. యోగాకు తాము వ్యతిరేకంగా కాదని స్పష్టం చేశారు. గ్రామ గ్రామానికి ఒక యోగా కేంద్రం పెట్టి అక్కడ శిక్షకులను నియమిస్తే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య కొంతైనా తీరుతుందన్నారు. ముఖ్యమంత్రికి చేతనైతే విశాఖకు వస్తున్న ప్రధాన మంత్రి చేత విశాఖ ఉక్కును ప్రైవేటీకరించమని ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 100 మంది ఇంటర్, బీటెక్‌లు చదువుకుంటే కేవలం 5 మందికి మాత్రమే ఉద్యోగాలు వస్తున్నాయని, మిగిలిన వారు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రోజుకో అఘాయిత్యం జరుగుతుందని, డ్రగ్స్ మాఫియా, మద్యపానం విపరీతంగా పెరిగిపోయిందని చెప్పారు. అమాయకులను పోలీసులు శిక్షిస్తున్నారని, దీనికి తెనాలి ఘటన నిదర్శనమన్నారు. వేలకోట్లు ఎగవేసిన మాయగాళ్లకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారని ధ్వజమెత్తారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు మాట్లాడుతూ... జిల్లాలో లక్ష కుటుంబాలు పొగాకు మీద ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్, ఎన్‌టీసీని రంగంలోకి దింపి పొగాకు కొనుగోలు చేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కంకణాల ఆంజనేయులు, పూనాటి ఆంజనేయులు, జీవి కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



కూటమి రూటే సెపరేట్ జై ప్రైవేట్!

- షైనింగ్ స్టార్ అవార్డుల్లో ప్రైవేట్ విద్యార్థులకే అగ్ర తాంబూలం
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులపై చిన్నచూపు
- భగ్గుమంటున్న తల్లిదండ్రులు, విద్యావేత్తలు

ఒంగోలు సిటీ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ కొత్త పోకడలు విద్యా వ్యవస్థను మరింత కుదేలు చేసేలా పరిణమించాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పేద, మధ్య తరగతి విద్యార్థుల ప్రయోజనాలను గాలికొదిలేసిన కూటమి సర్కారు.. ప్రైవేట్ విద్యా సంస్థల సేవలో తరిస్తున్న తీరుపై విద్యావేత్తలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన విద్యా సంస్కరణలను ఉద్దేశపూర్వకంగా విస్మరించిన కూటమి పాలకులు.. విద్య వ్యవస్థను కార్పొరేట్‌కు దారాదత్తం చేసేలా నిర్ణయాలు తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా షైనింగ్ స్టార్ పేరిట అవార్డులిచ్చిన ప్రభుత్వం.. సర్కారు బడి పిల్లలపై నిర్లక్ష్యం చూపి ప్రైవేట్ విద్యార్థులపై ప్రేమ ఒలకబోసింది. ఏ ప్రభుత్వమైనా తొలుత ప్రభుత్వ పాఠశాలలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం, ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు అందించి ప్రోత్సహించడం సహజం. కానీ కూటమి సర్కారు ప్రోత్సాహకాల్లో ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులకే అగ్రతాంబూలం దక్కడంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసినట్టయింది.

ప్రైవేట్‌కు దాసోహం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఫౌండేషన్ స్కూల్ నుంచి యూనివర్సిటీ వరకు అనేక సంస్కరణలు తీసుకొచ్చి విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇంగ్లిష్ మీడియం, అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబుల పంపిణీ, బైజూస్ కంటెంట్, టోఫెల్ తదితర సంస్కరణలు అమలు చేసి పేద మధ్యతరగతి పిల్లల విద్యాభివృద్ధికి తోడ్పడింది. ఫలితంగా విద్యాభివృద్ధిలో కేరళను సైతం అధిగమించి ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. అయితే ఏడాది క్రితం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం.. గత ప్రభుత్వ కార్యక్రమాలను కొనసాగించకుండా కార్పొరేట్ విద్యావ్యవస్థకు రెడ్ కార్పెట్ పరిచిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీకి అనుకూలంగా నిబంధనలు సవరించడం సర్కారు తీరును తేటతెల్లం చేస్తోంది.

షైనింగ్ స్టార్ అవార్డుల పంపిణీ తీరు ఇలా..

ఎంపిక చేసిన టెన్త్ విద్యార్థులు 242		ఎంపిక చేసిన ఇంటర్ విద్యార్థులు 36	
ప్రభుత్వ పాఠశాలలకు చెందిన వారు 88	ప్రైవేట్ పాఠశాలలకు చెందిన వారు 154	ప్రభుత్వ కళాశాలలకు చెందిన వారు 11	ప్రైవేట్ కళాశాలలకు చెందిన వారు 25

లారీలపై పన్ను బాదుడే బాదుడు

- మూడు నెలలకోసారి పన్ను పెంచుతున్న కూటమి ప్రభుత్వం
- కార్మికుల పొట్టలు కొట్టేలా రవాణా చట్టాలు
- రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ ధ్వజం

ఒంగోలు టౌన్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రతి మూడు నెలలకోసారి పన్నులు పెంచడం వల్ల లారీ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ పేర్కొన్నా. జీవో నంబర్ 21 తీసుకొచ్చి రవాణా కార్మికుల మీద చలానాలు, శిక్షలు పెంచేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని, ఇది కార్మికులకు తలకుమించిన భారంగా మారిందన్నారు. ప్రభుత్వం కార్మికులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముజఫర్ మాట్లాడుతూ.. రవాణా రంగంలో అనేక చట్టాలు తీసుకొచ్చి కార్మికుల పొట్టలు కొడుతున్నారని మండిపడ్డారు. బీఎన్ఎస్ చట్టం వచ్చిన తర్వాత దేశ వ్యాప్తంగా రవాణా కార్మికుల మీద కేసులు బనాయించే సంస్కృతి పెరిగిపోయిందన్నారు. ఆలిండియా ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ పోరాటాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం కొంత డైలామాలో పడినప్పటికీ దొడ్డిదారిన చట్టాలు అమలు చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. కేరళలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రతి వర్కర్ నుంచి మినిమం ఫండ్ వసూలు చేసి పథకాలు అమలు చేస్తున్నారని, ఇదే పద్ధతిని దేశం మొత్తం అమలు చేయాలని కోరారు. జూలై 15, 16వ తేదీల్లో ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తంబి శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన సమావేశంలో మహమ్మద్ హుసేన్, కాశీ విశ్వనాథం, సయ్యద్ మున్నా భాషా, పిచ్చిరెడ్డి, బ్రహ్మయ్య, అల్లాడి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముజఫర్

హనుమంత వాహనంపై నారసింహుడు

సింగరాయకొండ: పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుధవారం గరుడోత్సవం సందర్భంగా స్వామి వారిని సోమరాజుపల్లి వరకు ఊరేగిస్తామని ఆలయ ఈఓ కృష్ణవేణి, ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకట లక్ష్మీ నరసింహాచార్యులు తెలిపారు.



హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న లక్ష్మీనరసింహస్వామి

సత్తా చాటిన బాపట్ల జిల్లా ఎడ్లు



బండ లాగుతున్న ఎడ్లు

సింగరాయకొండ: పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ సమీపంలో మంగళవారం సాయంత్రం శ్రీకృష్ణ యాదవ్ యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఫ్లడ్ లైట్ల వెలుగులో నిర్వహించిన ఈ పోటీల్లో 5 జతల ఎడ్లు పాల్గొన్నాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోటి శిరీషాచౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత ప్రథమ బహుమతి రూ.70 వేలు, , నంద్యాల జిల్లా గోసపాడు మండలం జిల్లెళ్ల గ్రామానికి చెందిన గొటికె హేత్విక్‌రెడ్డి, దినేష్‌రెడ్డి ఎడ్లు ద్వితీయ బహుమతి రూ.50 వేలు, గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండబాలవారిపాలెం గ్రామానికి చెందిన జీపీ చౌదరి బుల్స్, గూడవల్లి లక్ష్మీ దీక్షిత ఎడ్లు తృతీయ బహుమతి రూ.40 వేలు, బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన పావులూరి వీరాస్వామి ఎడ్లు నాలుగో బహుమతి రూ.30 వేలు సాధించాయి. బుధవారం రాష్ట్ర స్థాయి రాధాడు పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

దివ్యాంగులకు బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు



ఉద్యోగాల ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: దివ్యాంగులకు బ్యాక్‌లాగ్ ఉద్యోగాలకు సంబంధించి అర్హులైన అభ్యర్థులకు నియామక పత్రాలను కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అందజేశారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని ఆమె చాంబర్‌లో 16 మంది దివ్యాంగులకు 2021–22 గ్రూప్–4 అంధుల విభాగంలో ఈ నియామకాలు చేపట్టారు. అందులో భాగంగా జూనియర్ అసిస్టెంట్ 2 పోస్టులకు మాట్రన్ కం స్టోర్ కీపర్ 1 పోస్టుకు, 2022–23 సంవత్సరానికి గాను గ్రూప్–4 విభాగంలో బధిరులకు 1 జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, టెక్నికల్ పోస్టుకు, క్లాస్–4 పోస్టుల విభాగంలో 10 పోస్టులకు అంధుల విభాగంలో ఆఫీస్ సబార్డినేట్ 2 పోస్టులకు, వాచ్‌మెన్ 2, సేవిక 1, బధిరుల విభాగంలో ఆఫీస్ సబ్ ఆర్డినేట్ 1 పోస్టు, శారీరక అంగ వైకల్యం విభాగంలో ఆఫీస్ సబ్ ఆర్డినేట్ 1 పోస్టు, కామాటి 1 పోస్టునకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల వేతనం పెంచాలి

మార్కాపురం టౌన్: వేతనం పెంచాలని డిమాండ్ చేస్తూ ఇంజినీరింగ్ కార్మికులు మంగళవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, సీఐటీయూ ఆధ్వర్యంలో మార్కాపురంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ కార్మికులకు జీవో 36 ప్రకారం రూ.21 వేలు నుంచి రూ.24,500కు వేతనం పెంచాలని, షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు కార్మికులకు దక్కాల్సిన అన్ని ప్రయోజనాలు అమలు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కె.సుబ్బరాయుడు, హరి, కృష్ణ, పి.సలాంఖాన్, ఎంసీహెచ్ అల్లూరయ్య, ఎం చెన్నకేశవులు, రషీద్, టి.శ్రీను, మరియదాసు, శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.